RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 206 | ఆగస్టు 27 గురువారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 206 | August 27 Thursday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


ఇండ్ల టవర్స్ పథకం కింద ఇండ్ల కేటాయింపు 2

# ఘోర రోడ్డు ప్రమాదం

## లారీని ఢీకొట్టిన ప్రయివేట్ బస్సు.. ఆరుగురు ప్రయాణికుల మృతి



**సూర్యాపేట జనసంఘర్షణ** సూర్యాపేట జిల్లా కోదాడ సమీపంలోని ద్వారకుంట శివారులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి ఏలూరు వైపు 42 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, మార్గమధ్యలో ఐరన్ లోడుతో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో ప్రయాణికులంతా గాఢనిద్రలో ఉన్న వేళ ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాద తీవ్రతకు లారీలోని ఐరన్ షీట్లు బస్సులోకి చొచ్చుకుపోవడంతో ఆరుగురు ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు, స్థానికులు తీవ్రంగా గాయపడిన వారిని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో మరణించిన వారంతా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారిగా నిర్ధారించారు. ఎన్టీఆర్ జిల్లా తేలప్రోలుకు చెందిన యాసారపు చిన్ని (32)తో పాటు విజయవాడకు చెందిన మేరీ జ్యోత్స్న (29), నాగేంద్రబాబు (21), సురవరపు షకీనా, భావన, లక్ష్మిగా మృతులను గుర్తించారు. డ్రైవర్ అతివేగం, నిద్రమత్తే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని పోలీసులు భావిస్తున్నారు. కాగా, ప్రమాదం జరిగిన వెంటనే బస్సు డ్రైవర్ మల్లికార్జున అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ విషాదకర సంఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని

➤ మిగతా 2వ పేజిలో..

# ప్రమాదంపై దిగ్భ్రాంతి



**అమరావతి జనసంఘర్షణ** సూర్యాపేట జిల్లా కోదాడ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నుంచి ఏలూరు వస్తున్న ప్రైవేట్ బస్సు ప్రమాదానికి గురై ఆరుగురు మృతి చెందడంపై ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరో 11 మంది తీవ్రంగా గాయపడగా, వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని తెలుసుకున్న ఆయన, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. సహాయక చర్యల కోసం తెలంగాణ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని ఏపీ యంత్రాంగానికి సూచిస్తూ, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ ఘటనపై ఏపీ మంత్రి నారా లోకేశ్ కూడా స్పందిస్తూ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన ప్రయాణికులకు నివాళులర్పించిన ఆయన, మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మరోవైపు ఏపీ రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఈ దుర్ఘటనపై సమీక్ష నిర్వహించారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో భద్రతా ప్రమాణాలు, డ్రైవర్ల అప్రమత్తత విషయంలో ఎటువంటి అలసత్వానికి తావులేకుండా నిబంధనలు కఠినంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణికుల భద్రతకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని యాజమాన్యాలకు స్పష్టం చేశారు. ఈ ప్రమాద నేపథ్యంలో ఏలూరు జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమై, సూర్యాపేట పోలీసులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ బాధితుల వివరాలను సేకరిస్తోంది.

# విరుచకపడిన వరదలు

## నీట మునిగిన నేపాల్



**ఖాట్మాండు జనసంఘర్షణ** నేపాల్‌లోని రసువా జిల్లాలో బుధవారం ఉదయం విరుచుకుపడిన ఆకస్మిక వరదలు తీవ్ర వినాశనాన్ని సృష్టించాయి. చైనా సరిహద్దు సమీపంలోని భోటే కోశీ నది ఉప్పొంగడంతో తీరప్రాంత గ్రామాలు, వంతెనలు మరియు ప్రాజెక్టులు నీటిలో కొట్టుకుపోయాయి. ఈ విపత్తులో సుమారు 1500 మంది వరకు గల్లంతైనట్లు అంచనా వేస్తుండగా, వారిలో 105 మంది భారతీయులు కూడా ఉన్నట్లు సమాచారం అందుతోంది. వరద ఉధృతికి నువాకోట్, ధాడింగ్ జిల్లాలు కూడా తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఇప్పటివరకు అధికారులు 8 మృతదేహాలను వెలికితీయగా, మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఆకస్మిక వరదలకు టిబెట్ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలే ప్రధాన కారణమని శాటిలైట్ చిత్రాల ద్వారా వెల్లడైంది. అయితే, దీనిపై చైనా ముందస్తు హెచ్చరికలు జారీ చేయకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాతావరణ మార్పులు, పెరుగుతున్న భూతాపం వల్ల హిమాలయాల్లో మంచు కరిగి ఏర్పడుతున్న అస్థిర గ్లేషియల్ సరస్సులు, కొండచరియలు విరిగిపడటం వంటి అంశాలు

➤ మిగతా 2వ పేజిలో..

# సహాయక చర్యలకు పూర్తి మద్దతు

## ప్రధాని నరేంద్ర మోడీ



**న్యూఢిల్లీ జనసంఘర్షణ** నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదల నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ నేపాల్ ప్రధాని బాలెన్ షాతో బుధవారం ఫోన్లో మాట్లాడారు. ఈ విపత్తు వల్ల ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సంతాపం తెలిపిన మోదీ, అక్కడి వరద పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కష్ట సమయంలో నేపాల్‌లోని సోదర సోదరీమణులకు

➤ మిగతా 2వ పేజిలో..

# వలసదారులపై కఠిన వైఖరీ



**వాషింగ్టన్ జనసంఘర్షణ** మెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని ప్రభుత్వం వలసదారులపై మరోసారి కఠిన వైఖరిని ప్రదర్శిస్తూ అనూహ్య నిర్ణయం తీసుకుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా రాయబార కార్యాలయాలు, కాన్సులేట్లలో వీసా అపాయింట్‌మెంట్లను అర్ధంతరంగా నిలిపివేయడంతో పాటు, ఇప్పటికే షెడ్యూల్ అయిన పలు ఇంటర్వ్యూలను రద్దు చేసింది.

➤ మిగతా 2వ పేజిలో..

జన సంఘర్షణ
27 గురువారం, ఆగస్టు 2026

# ఘోర రోడ్డు ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి..** తెలియజేసిన ఆయన, క్షతగాత్రులకు తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. స్థానిక మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచనలతో సూర్యాపేట జిల్లా కలెక్టర్, ఎస్పీలు స్వయంగా కోదాడ ఆసుపత్రికి చేరుకుని ప్రయాణికుల పరిస్థితులను సమీక్షించి బాధితులను పరామర్శించారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా ప్రభుత్వం సూచించింది.

## అప్రమత్తమైన బీహార్, యూపీ ప్రభుత్వాలు

**మొదటిపేజీ తరువాయి..** నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదల దాటికి ఇప్పటివరకు 16 మంది ప్రాణాలు కోల్పోగా, సుమారు 400 మంది గల్లంతైనట్లు స్థానిక అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ దారుణ విపత్తు ప్రభావం సరిహద్దు దాటి వ్యాపించే అవకాశం ఉండటంతో భారత్‌లోని బీహార్, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాలు తీవ్ర అప్రమత్తమయ్యాయి. నేపాల్‌తో సరిహద్దు పంచుకునే ప్రాంతాలలో ముందస్తు ముప్పును నివారించేందుకు ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అత్యవసర చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో బీహార్ ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి అధ్యక్షతన బుధవారం ఉన్నత స్థాయి అత్యవసర సమావేశం జరిగింది. సరిహద్దు జిల్లాల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, డ్యామ్‌లు, కరకట్టలపై 24 గంటల పాటు రాత్రింబవళ్లు పెట్రోలింగ్ నిర్వహిస్తూ గట్టి నిఘా ఉంచాలని అధికారులను ఆయన ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను లౌడ్‌స్పీకర్ల ద్వారా ఖాళీ చేయిస్తూ హెచ్చరికలు జారీ చేయాలని, ఏ క్షణమైనా రంగంలోకి దిగేందుకు ఎన్డీఆర్ఎఫ్ (చీణ=ఖీ), ఎస్డీఆర్ఎఫ్ (=ణ=ఖీ) బృందాలను సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు. మరోవైపు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా వరద ముప్పుపై అధికారులను అప్రమత్తం చేశారు. నేపాల్ నుంచి వస్తున్న వరద నీటితో గండక్, నారాయణి నదుల్లో నీటిమట్టాలు వేగంగా పెరుగుతున్నాయని ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. దీనివల్ల మహారాజ్‌గంజ్, కుషీనగర్ జిల్లాలకు తీవ్ర వరద ప్రమాదం పొంచి ఉన్నందున స్థానిక యంత్రాంగం ముందస్తు భద్రతా ఏర్పాట్లతో పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని ఆదేశించారు.

## ఇండ్ల టవర్స్ పథకం కింద ఇండ్ల కేటాయింపు

హైదరాబాద్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ పథకం కింద ఇండ్ల కేటాయింపు ప్రక్రియను ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించేందుకు తెలంగాణ హౌసింగ్ బోర్డు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రోజుకు నాలుగు నియోజకవర్గాల చొప్పున నాలుగు రోజుల పాటు ఈ లాటరీ ప్రక్రియ కొనసాగనుంది. ఈ డ్రా పద్ధతినంతటినీ దరఖాస్తుదారులు, ప్రజలు వీక్షించేలా యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం (లైవ్ స్ట్రీమింగ్) చేయనున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి. గౌతమ్ తెలిపారు. లాటరీ ప్రక్రియలో ఎటువంటి సందేహాలు, అపోహలకు ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకత పాటిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. స్థలాభావం మరియు భద్రతా కారణాల దృష్ట్యా దరఖాస్తుదారులందరినీ లాటరీ కేంద్రాల్లోకి అనుమతించలేమని, అయితే ఆయా కేంద్రాల వెలుపల పెద్ద స్క్రీన్ల ద్వారా డ్రా జరుగుతున్న తీరును ప్రజలు నేరుగా వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. అంతేకాకుండా, హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌తో పాటు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా కూడా ఈ ప్రత్యక్ష ప్రసారాన్ని చూడవచ్చని పేర్కొన్నారు. ఈ పథకం కింద ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించిన పిమ్మట, అనర్హులుగా గుర్తించిన వారి నుంచి అభ్యంతరాలను స్వీకరించి వాటికి తగిన పరిష్కారం చూపించినట్లు వి.పి. గౌతమ్ వెల్లడించారు. అన్ని పరిశీలనలు పూర్తయినందున అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకమైన లాటరీ పద్ధతి ద్వారానే ఇండ్ల కేటాయింపులు జరుపుతామని తెలిపారు.

## విరుచకపడిన వరదలు

**మొదటిపేజీ తరువాయి..** ఇటువంటి విపత్తుల తీవ్రతను మరింత పెంచుతున్నాయి. లోతట్టు ప్రాంతాలకు ఒక్కసారిగా ఉధృతంగా దూసుకొచ్చిన ఈ ప్రవాహం అనేక నివాసాలను నేలమట్టం చేసింది. నేపాల్‌లో ఏర్పడిన ఈ పరిస్థితితో దిగువన ఉన్న భారత రాష్ట్రాలైన బిహార్, ఉత్తర ప్రదేశ్‌లు కూడా ముందస్తుగా అప్రమత్తమయ్యాయి.
ప్రస్తుతం వరద ప్రభావిత ప్రాంతాల్లో 15 హెలికాప్టర్లతో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. బుసి, తుసు ప్రాంతాల్లో కొట్టుకుపోతున్న 20 మందిని రెస్క్యూ సిబ్బంది సురక్షితంగా రక్షించి, గాయపడిన వారికి మచిలి ట్రైనింగ్ క్యాంప్‌లో వైద్యం అందిస్తున్నారు. నదీ పరివాహక ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న అధికారులు, మిగిలిన బాధితుల కోసం గాలింపును వేగవంతం చేశారు.

## వలసదారులపై కఠిన వైఖరీ

**మొదటిపేజీ తరువాయి..** ఈ రద్దు సమాచారాన్ని దరఖాస్తుదారులకు ఇమెయిల్ ద్వారా తెలియజేసిన అధికారులు, త్వరలోనే రీషెడ్యూల్ సమయాన్ని వెల్లడిస్తామని పేర్కొన్నారు. ఈ నిర్ణయంపై అమెరికా విదేశాంగ శాఖ స్పందిస్తూ.. తమ కాన్సులర్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందువల్లే వీసా అపాయింట్‌మెంట్లను సర్దుబాటు చేయాల్సి వచ్చిందని స్పష్టం చేసింది. అయితే ఈ శిక్షణ దేనికి సంబంధించినది, ఎంతకాలం కొనసాగుతుందనే అంశాలపై స్పష్టమైన వివరాలు వెల్లడించలేదు. అమెరికా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆధారపడే అవకాశం ఉన్న విదేశీ దరఖాస్తుదారులను ప్రాథమిక దశలోనే గుర్తించి తిరస్కరించేలా కాన్సులర్ అధికారులకు ఈ వడపోత శిక్షణ ఇస్తున్నట్లు సమాచారం.

## మత్స్యకారులు సురక్షితం

కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లి ఆచూకీ లేకుండా పోయిన ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్‌లోని శంకర్ పూర్ ఫిషింగ్ హార్బర్ సమీపంలో సురక్షితంగా ఉన్నట్లు నిర్ధారణ కావడంపై ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 3న వేటకు వెళ్లిన బోటు నిర్ణీత సమయానికి తిరిగి రాకపోవడంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తక్షణమే స్పందించి గాలింపు చర్యలకు ఆదేశించారని ఆయన తెలిపారు. సాంకేతిక లోపాలు, సముద్ర ప్రవాహాలు మరియు గాలి దిశను శాస్త్రీయంగా విశ్లేషించి బోటు పశ్చిమ బెంగాల్ వైపు వెళ్లి ఉండవచ్చని అంచనా వేసి, అక్కడ కోస్ట్ గార్డ్ యూనిట్లను అప్రమత్తం చేయడం వల్లనే ఈ ఫలితం సాధ్యమైందని చెప్పారు.
రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర యంత్రాంగం, ఇండియన్ నేవీ, కోస్ట్ గార్డ్ మరియు మత్స్యశాఖ అధికారులు నిరంతరం సమన్వయంతో వ్యవహరించి గాలింపు చర్యలు చేపట్టారని మంత్రి వివరించారు. ప్రస్తుతం ఏడుగురు మత్స్యకారులు పూర్తి ఆరోగ్యంతో ఉన్నారని, బోటు యజమాని సోదరుడు భవానీ ప్రసాద్ ద్వారా ఈ విషయాన్ని ధృవీకరించుకోవడంతో పాటు కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడించామని పేర్కొన్నారు. మత్స్యకారుల భద్రతకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, వారందరినీ సురక్షితంగా స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు మత్స్యశాఖ అధికారులు తగిన చర్యలు చేపడుతున్నారని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## భట్టితో కొండా భేటీ

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో ఇటీవల చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలు తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి. ఈ క్రమంలో ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, నేత కొండా మురళి భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ క్రమశిక్షణ కమిటీకి నివేదిక అందిన తర్వాతే ఈ సమావేశం జరగడంతో రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ నడిచింది. అయితే, భేటీ అనంతరం కొండా మురళి మీడియాతో మాట్లాడుతూ.. ఇది కేవలం సాధారణ కలయిక మాత్రమేనని, కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అలాగే తానెప్పుడూ సీఎంకు కానీ, పార్టీకి కానీ వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయలేదని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి తెలిపారు.

వరంగల్ జిల్లా పరకాలలో జరిగిన మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో వారి కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు ఈ వివాదానికి మూలకారణంగా మారాయి. సీఎం రేవంత్ రెడ్డి హామీల అమలులో విఫలమయ్యారని విమర్శించడంతో పాటు, రాబోయే ఎన్నికల్లో తనకు పరకాల టికెట్ ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ఆమె ప్రకటించడం పార్టీలో కలకలం రేపింది. ఈ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేసిన తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ సుస్మితపై చర్యలకు సిద్ధమవుతోంది. కాగా, ఈ పరిణామాలపై కొండా మురళి స్పందిస్తూ సుస్మిత చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగతమని, వాటితో తమకు ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పారు. సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీలపై తమకు సంపూర్ణ విశ్వాసం ఉందని, క్రమశిక్షణ కమిటీ తుది నిర్ణయం వెలువడే వరకు తాము ఏమీ మాట్లాడబోమని ఆయన వెల్లడించారు.

## సహాయక చర్యలకు పూర్తి మద్దతు

**మొదటిపేజీ తరువాయి..** భారత్ పూర్తి అండగా ఉంటుందని, అన్ని రకాల సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. రెండు దేశాల సహాయక బృందాలు పరస్పరం సమన్వయంతో పనిచేస్తున్నాయని ఆయన తన సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా వెల్లడించారు. టిబెట్ వైపు నుంచి వచ్చిన మెరుపు వరదల వల్ల భోటేకోశీ నది ఉప్పొంగి నువాకోట్, ధాడింగ్ జిల్లాల్లో తీవ్ర బీభత్సం సృష్టించింది. రసువా జిల్లాలో సుమారు 1000 మంది వరద నీటిలో కొట్టుకుపోయినట్లు అధికారులు అంచనా వేస్తుండగా, అందులో 105 మంది భారతీయులు కూడా ఉన్నట్లు సమాచారం అందుతోంది. పలు గ్రామాలు, వంతెనలు నీట మునిగిన ఈ దుర్ఘటనలో భారత్ నుంచి రక్షణ, సహాయక చర్యల కోసం పూర్తి మద్దతు ప్రకటించారు.

## ప్రజాభవన్‌లో వార్ రూం

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026 – ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్' నిర్వహణలో భాగంగా ప్రజాభవన్‌లో తక్షణమే ఒక ప్రత్యేక వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రజాభవన్‌లో ఆయన అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజులతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిసెంబర్‌లో జరగనున్న ఈ ప్రతిష్టాత్మక సమ్మిట్ కోసం విదేశీ, దేశీయ పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు అంతర్జాతీయ స్థాయిలో విస్తృతంగా రోడ్ షోలు నిర్వహించాలని, ఆహ్వాన పత్రాల పంపిణీ ప్రక్రియను ఏమాత్రం ఆలస్యం చేయకుండా వేగవంతం చేయాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సమ్మిట్ ఏర్పాట్లు మరియు వివిధ కమిటీల బాధ్యతలను సకాలంలో పూర్తి చేసేందుకు సీఎస్ సంజయ్ జాజు రోజుకు కనీసం ఒక గంట పాటు రోజువారీ సమీక్షలు నిర్వహించాలని సూచించారు. సీనియర్ అధికారి పర్యవేక్షణలో వార్ రూమ్ కార్యకలాపాలు పటిష్టంగా ఉండాలని, వివిధ కమిటీలలో అవసరమైన రంగాల నిపుణులను, కీలక అధికారులను భాగస్వామ్యులను చేయాలని తెలిపారు. అలాగే, గతంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్లలో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల (వీశీఖం) ప్రస్తుత పురోగతిపై సమగ్ర విశ్లేషణ చేసేందుకు ప్రత్యేక కమిటీకి బాధ్యతలు అప్పగించాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు

## భూతనాథ సరస్సులో ఆరు మృతదేహాలు

కర్ణాటకలోని ప్రసిద్ధ చారిత్రక పట్టణమైన బాదామిలో తీవ్ర కలకలం చోటుచేసుకుంది. అక్కడి గుహాలయాల దిగువ భాగంలో ఉన్న భూతనాథ సరస్సులో బుధవారం ఉదయం ఒకేసారి ఆరు మృతదేహాలు లభ్యం కావడం స్థానికంగా భయాందోళనలు సృష్టించింది. నీటిపై మృతదేహాలు తేలియాడటాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను వెలికితీసి, సరస్సులో ఇంకా ఎవరైనా గల్లంతయ్యారా అనే కోణంలో గజఈతగాళ్లతో ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు.

అయితే, ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ఈ సరస్సును సందర్శించేందుకు వచ్చిన సమయంలో ప్రమాదవశాత్తు వీరు నీటిలో పడిపోయారా, లేక ఏమైనా సామూహిక ఆత్మహత్యకు పాల్పడ్డారా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. అలాగే, వరద ఉధృతికి ఎగువ ప్రాంతం నుంచి ఈ మృతదేహాలు ఏమైనా కొట్టుకువచ్చాయా, ప్రాణాలు కోల్పోయిన వారంతా ఒకే కుటుంబానికి చెందినవారా అన్న అనుమానాలను సైతం పోలీసులు లోతుగా పరిశీలిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, మృతుల గుర్తింపు కోసం విచారణ ముమ్మరంగా కొనసాగుతోంది.

# ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం జోలుకొస్తే ఖబర్దార్

- టిఏజిఎస్ జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరిక చేశారు.
- సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మచ్చా రామారావు డిమాండ్ చేశారు.





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, ఆగష్టు 26(జనసంఘర్షణ):

చర్ల మండలం, బడే సీతా రామయ్య భవనంలో సంఘం జెండా ఆవిష్కరణ అనంతరం కొమరం భీమ్, బిర్సా ముండా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం 9వ మండల మహాసభ వరదల వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన జరిగింది. ఈ మహాసభలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం, జోలికొస్తే ఖబర్దార్ అని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక చేశారు. 1/70 చట్టాన్ని సవరించాలని గిరిజనేత్రులు పెట్టిన పిటిషన్ ని కొట్టివేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో అన్ని హక్కులు ఆదివాసీలకే చెందాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. జీవో నెంబర్ 3ను కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ ద్వారా పునరుద్ధరణ చేయాలని ఏజెన్సీ ప్రాంతంలో ఖాళీగా ఉన్న బ్యాక్లాగ్ పోస్టులన్నీ ఆదివాసీలతోనే నింపాలని, స్పెషల్ డిఎస్సి ని నిర్వహించాలని, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీలు గత అనేక సంవత్సరాల నుండి సాగు చేస్తున్న భూములకు 2006 అటవీ హక్కుల గుర్తింపు చట్టం ప్రకారం హక్కు పత్రాలు ఇవ్వాలని ఆయన అన్నారు. చర్ల మండలంలో అనేక ఆదివాసి గ్రామాలలో రోడ్లు విద్యుత్ సౌకర్యాలు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సర్వ చూపడం లేదని గెలిచిన ప్రజాప్రతినిధులు అభివృద్ధి అనే సంగతి మర్చిపోయారని ఆయన ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే ఎంపీలకు గుర్తు చేశారు లేదంటే రానున్న కాలంలో పెద్ద ఎత్తున తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేపడుతామని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల ఉపాధ్యక్షులు మచ్చా రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బందేల చంటి గిరిజనుల అభివృద్ధి కోసం సందేశం ఇవ్వడం జరిగింది. పాల్గొన్నవారు తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి కారం నరేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వర్మ సోడి నాగేశ్వరావు, కనితి రామారావు, కాక రాజు, శ్యామల రాజేష్, శ్యామల వినోద్, అర్జున్, శ్యామల కాంతారావు, వెంకటేశ్వర్లు, తెల్లబోయిన రాజు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోధన్ ఆగస్టు 26(జన సంఘర్షణ)



బోధన్ పట్టణం రాకాస్ పేట్ 11కేవీ ఫిడర్ మెయింటెనెన్స్, చెట్ల కొమ్మల కటింగ్ పనుల కారణంగా భీముని గుట్ట, గౌడ్స్ కాలనీలో రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాయిని కృష్ణ తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం.. నిజామాబాద్ యువకుడి మృతి

బోధన్, ఆగస్టు 26(జన సంఘర్షణ)



అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నిజామాబాదు చెందిన యువకుడు మృతి చెందాడు. ఫ్లోరిడాలో జరిగిన యాక్సిడెంట్లో తెలంగాణకు చెందిన ముగ్గురు మరణించారు. వారిలో నిజామాబాద్ శివారులోని గూపన్పల్లికి చెందిన హరిబాబు, నాగమణి కుమారుడు రాహుల్ చనిపోయాడు. అతను మూడు నెలల క్రితం ఎంఎస్ చదవడానికి అమెరికాకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# సర్ పై గ్రామ సభలు నిర్వహించాలి

- బోధన్ ఆర్డీఓ
- బోధన్ నియోజకవర్గ పరిధిలోని మండలాల్లోని గ్రామాల్లో ఆగస్టు 27న గ్రామ సభలు నిర్వహించాలి

బోధన్, ఆగస్టు 26 (జన సంఘర్షణ)



ప్రత్యేక సమగ్ర సవరణ ( సర్-2026) కార్యక్రమంలో భాగంగా బోధన్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లోని గ్రామాల్లో ఆగస్టు 27న గ్రామ సభలు నిర్వహించాలని బోధన్ నియోజకవర్గ ఎన్నికల నోడల్ అధికారి, బోధన్ ఆర్డీఓ ఎం. విజయ కుమారి సూచించారు. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభల్లో మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపు, నివాసం మారిన వారి పేర్లపై పరిశీలన, డబుల్ ఎంట్రీ అయిన ఓటర్ల గుర్తింపు, అర్హులైన కొత్త ఓటర్లను జాబితాలో చేర్చడం వంటి అంశాలపై ప్రజలకు వివరించనున్నారు. ప్రతి ఓటరు, గ్రామ ప్రజలు ఈ సభలకు తప్పనిసరిగా హాజరై సవరణ ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆర్డీఓ కోరారు. ఓటర్ జాబితాలో తమ పేరు, వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. గ్రామాల్లో తప్పుడు, చెల్లని లేదా మరణించిన ఓటర్లకు సంబంధించిన వివరాలు ఉంటే వాటిని అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ముఖ్యంగా బి ఎల్ ఓ, సూపర్వైజర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ సిబ్బంది ప్రజలకు అవసరమైన సహకారం అందిస్తారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు ఉండేలా, అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటర్ జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఆర్డీఓ తెలిపారు. "ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో సరైన ఓటర్ జాబితా కీలకం. కాబట్టి ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలి" అని ఆమె పిలుపునిచ్చారు. ఓటర్లకు మరింత సమాచారం కోసం 1950 టోల్‌ఫ్రీ నంబర్ను సంప్రదించవచ్చని అధికారులు సూచించారు.

# నూతన ట్రైబల్ జర్నలిస్ట్ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం

ఆదిలాబాద్ జిల్లా, ఉట్నూర్ మండలం, ఆగష్టు 26(జనసంఘర్షణ):









ఉట్నూర్ మండలంలోని లింగోజితండా ఎక్స్‌రోడ్డు గ్రామంలో బుధవారం నూతన ట్రైబల్ జర్నలిస్ట్ అసోసియేషన్ కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. ఐటీడీఏ ఏపీఓ జాదవ్ వసంత్ రావు, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథ్, స్థానిక సర్పంచ్ మాయ జాదవ్, ఉప సర్పంచ్ హరి నాయక్ జాదవ్‌లు రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య జర్నలిస్టులు వారధిగా వ్యవహరిస్తారని అన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు వాటి పరిష్కారానికి జర్నలిస్టులు కృషి చేయాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో కూడా ప్రత్యేకంగా ట్రైబల్ జర్నలిస్టుల అసోసియేషన్ ఏర్పాటు కావడం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం ముందుకు సాగాలని సూచించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు లాకావత్ రమేష్, కార్యదర్శి మాడవి మాణిక్ రావు, చవాన్ రామేశ్వర్, కోశాధికారి జాదవ్ వసంత్ రావు, ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు రాథోడ్ సంతోష్, ఆసిఫాబాద్-కొమురంభీం జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్రం రాము, ఉట్నూర్ డివిజన్ అధ్యక్షుడు రాథోడ్ అజయ్, ప్రచార కార్యదర్శి సిడం కైలాష్, రాథోడ్ నాందేవ్, జాయింట్ సెక్రటరీ జాదవ్ రవికిరణ్, భీమ్ రావు, రవీందర్, మనోజ్, పీత నాయక్, దత్త ఆదివాసీ సోషల్ మీడియా కొట్నాక్ దేవిధస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు అమలు చేయండి

- బిఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, ఆగష్టు 26(జనసంఘర్షణ):





చర్ల మండలంలో ఆసరా పెన్షన్లు వెంటనే విడుదల చేయాలని బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు 15 న వికలాంగులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, ఫెన్షన్లు, రేషన్ కార్డులు ప్రజలకు ఇస్తామని మోసం చేసింది మీ సేవలకు ఎం ఆర్ ఓ ఆఫీసుకు ప్రజలు తిరిగి వేల రూపాయలు ఖర్చు చేసి ప్రజలు పెన్షన్లు రాక ఆవేదన చెందుతున్నారు. ముసలి వారైన వృద్ధులను పక్కన పెట్టారు. వారికి కూడా పెన్షన్ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో జూన్ 2 న లక్ష 50 వేల ఇందిరమ్మ ఇళ్ల ఇస్తామని ఇంత వరకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వకుండా మోసం చేసారు. గతంలో కట్టిన ఇందిరమ్మ ఇళ్లకు 5 లక్షలు ఇవ్వకుండా 3 లక్షల 40 వేలు మాత్రమే ఇచ్చి వాళ్లను అప్పుల పాలు చేసారు. గతంలో విద్యార్థులకు స్వయం ఉపాధి కొరకు లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చేస్తామని మీసేవ ద్వారా అప్లై చేసిన తరువాత రద్దు చేసి విద్యార్థులను మోసం చేసారు మహిళలను కోటీశ్వరలను చేస్తానని మోసం చేసారు. తెలంగాణ బీద ఆడబిడ్డల కోసం పెళ్లి ఖర్చుల కోసం కళ్యాణ్ లక్ష్మి, షాదిముబారాక్ పథకాలు గవర్నమెంట్ హాస్పిటలో పురుడు పోసుకునే మహిళలకు అబ్బాయి పుడితే 12 వేలు, అమ్మాయి పుడితే 13 వేలు ఇచ్చే, కెసిఆర్ కిట్టు పథకం ప్రతీ ఇంట్లో మహిళలకు 2500 లేవు. గ్యాస్ సిలిండర్ 500 లకు లేదు, తులం బంగారం లేదు, మహిళలను మోసం చేసారు. కుటుంబంలో రైతు చనిపోతే వారి కుటుంబం ఇబ్బందులు పడకుండా 5 లక్షల బీమా సౌకర్యం కల్పించారు. కెసిఆర్ ప్రతీ సంవత్సరం ఆగస్టు 14 ఇన్సూరెన్స్ ఎల్ఐసి ఆఫీసులో కట్టాలి. ఇంత వరకు ఇన్సూరెన్స్ అమౌంట్ చెల్లించలేదు ఈ మధ్యలో రైతు చనిపోతే వారి కుటుంబం పరిస్థితి ఏంటి రైతు భరోసా పూర్తిగా ఇవ్వ లేదు రైతు రుణమాఫీ అందరికి చేయలేదు కౌలు రైతులకు రైతు భరోసా లేదు నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవు. నిరుద్యోగ భృతి 3600లేవు. వృద్ధులకు పెన్షన్లు లేవు. ఉద్యోగులకు డిఏ లేవు పిఆర్సి లేదు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ బెనిఫిట్స ఇవ్వటం లేదు. తెలంగాణ ప్రజలను 6 గ్యారంటీలు, 420 హామీలతో అనేక అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి గురించి పట్టించుకోవడం లేదు . ముఖ్యమంత్రి విదేశాలకు తిరగడం మంత్రులు పార్టీ గొడవలతో ప్రజా పరిపాలన మర్చిపోయరు, అందుకే కెటిఆర్ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 2 నుండి 7 రోజులు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసలను ఇంటింటికీ తిరిగి తెలియజేస్తాం. బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ఈ విషయం లో సైనికుడులా పని చేయుటకు సిద్ధంగా ఉన్నారు.

# సీతమ్మ సాగర్ నిర్వాశితులు బోగస్ పత్రాలు

- ప్రభుత్వ ఖజానాకు గండి
- ప్రజల సొమ్ము అక్రమార్కుల ఖాతా లో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, ఆగష్టు 26(జనసంఘర్షణ):


సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ లో జరిగిన అవినీతి అక్రమాలు బయటకి రావాలి

సీతమ్మ సాగర్ కరకట్ల పేరు చెప్పి దొంగ పట్టాలు చేసుకున్న వారిని శిక్షించాలి మరియు రైతు బంధు కరకట్ల సొమ్ము ప్రభుత్వానికి హ్యాండ్ ఓవర్ చేయాలి.

చర్ల మండలం వీరాపురంలో సర్వే నెంబర్లు 25/2 మరియు 26:
25/2 లో 10 ఎకరములు 20 సెంట్లు
26 లో 23 ఎకరములు 30 సెంట్లు
ఇవి దొంగ పట్టాలు, వీటి మీద చర్య తీసుకోవలసిన అవసరం ఉంది.
జిపి పల్లి నందు:
52/1 లో 7 ఎకరములు 10 కుంటలు
52/3 లో 30 కుంటలు
ఇవి కూడా దొంగ పట్టాలే, వీటి మీద నిగా తేల్చాల్సిన అవసరం ఉంది. వీటికి సాక్షి ఆధారాలు ఉన్నవి. కాబట్టి గ్రామ సభ పెట్టి నిగ్గులు తేల్చాల్సిన సమయం, అవసరం ఉంది. నిగ్గు తేల్చండి.

చర్ల మండలం, ఎం పి పల్లి,( మచ్చా వారి పులిబోయినపల్లి), జి పి పల్లి, (గోమ్ము పులి బోయినపల్లి) లో సీతమ్మ సాగర్ కర కట్టా భూమీ నిర్వశితులు గా అసలు భూమి లేకుండా భూమి పట్టాలు పొంది, భూమి పరిహారం పొందినారు. వారికి సెటిల్మెంట్ పట్టాలు, వారికీ భూమి సంక్రమించిన విధానం, జామిందారి విధానం లో భూమి సంక్రమించినదా, గవర్నమెంట్ విధానంలో అనుమతులు పొందినార తగు పత్రాలు పరిశీలించి, గ్రామ సభలో వెల్లడి చేసి విచారణ చేయాలి. లేని యడల అక్రమంగా పత్రాలు పొందిన యడల వారు పొందిన, సంక్రమించిన భూమిని రద్దు పరిచి, సీతమ్మ సాగర్ నిర్వాషిత భూమి, పరిహారం పొందిన యడల వారి నుంచి రికవరీగా నగదును స్వదిన పర్చుకొని అధికారులు తక్షణమే ప్రభుత్వ ఖజానాకు తరలించాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

జన సంఘర్షణ
గురువారం
27 ఆగస్టు 2026

# పోచారం శవ రాజకీయాలు మానుకోవాలి

- వెంకటేష్ హత్యపై సమగ్ర విచారణ జరపాలి..
- రవీందర్‌రెడ్డిపై దుష్ప్రచారాన్ని సహించేది లేదు





**నిజామాబాద్ /ఆగస్టు 26 /(జనసంఘర్షణ):** మాజీ సర్పంచ్ వెంకటేష్ హత్య ఘటనపై వర్ని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి నిర్లక్ష్య వైఖరి వల్లే ఈ ఘటనకు దారితీసిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. హత్యకు గురైన వెంకటేష్, నిందితుడు ఇద్దరూ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అనుచరులేనని వారు పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలు రాజకీయ నాయకుల వాదనలేనని, ఘటనపై పోలీసుల దర్యాప్తులో వాస్తవాలు తేలాల్సి ఉందని స్పష్టం చేశారు. బుధవారం వర్ని మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ భాస్కర్, మాజీ ఎంపీపీ బజ్యా నాయక్ వీర్రాజు, న్యాయవాది రమేష్ రాథోడ్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. వెంకటేష్, నిందితుడి మధ్య కొనసాగుతున్న భూ వివాదాన్ని పరిష్కరించేందుకు పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఆశ్రయించినట్లు తెలిపారు. సమస్య పరిష్కారంలో జాప్యం జరిగిందని, అదే చివరకు విషాద ఘటనకు దారితీసిందని ఆరోపించారు. ఈ హత్య ఘటనలో బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

**దిష్టిబొమ్మ దహనంపై ఆగ్రహం...!**

హత్య ఘటనకు సంబంధం లేని రవీందర్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని దిష్టిబొమ్మ దహనం చేయడం రాజకీయ కక్షసాధింపులో భాగమేనని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. హత్యకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి పోచారం శ్రీనివాస్‌రెడ్డితో ఉన్న ఫొటోలను వారు మీడియా ముందు ప్రదర్శించారు. వాటి ఆధారంగా సంబంధాలను నిర్ధారించడం కాదని, పూర్తి విచారణ ద్వారా వాస్తవాలను బయటకు తీసుకురావాలని డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాల్సిన సమయంలో ఘటనను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం సరికాదని, "శవ రాజకీయాలకు స్వస్తి పలకాలి" అని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. రాజకీయ ప్రత్యర్థులను భయపెట్టడం, బెదిరించడం వంటి చర్యలకు పాల్పడితే ప్రజాస్వామ్య పద్ధతిలో, అవసరమైతే న్యాయపరంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.



**పోచారం రాజకీయ వైఖరి స్పష్టం చేయాలి..!**

పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రస్తుతం ఏ రాజకీయ పార్టీలో కొనసాగుతున్నారో స్పష్టం చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. తనకు కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేదని కార్యకర్తలకు చెబుతూ, మరోవైపు ఆయన కుమారుడు భాస్కర్‌రెడ్డి కాంగ్రెస్ కండువాతో రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని వారు విమర్శించారు. రవీందర్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం ఘటనపై న్యాయపరమైన చర్యలకు సిద్ధమవుతున్నామని న్యాయవాది రమేష్ రాథోడ్ తెలిపారు. వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. వెంకటేష్ హత్య ఘటనపై రాజకీయ ఆరోపణలకు అతీతంగా పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి అసలు కారణాలను వెలుగులోకి తీసుకురావాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# పోచారం భాస్కర్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలి

- వెంకటేష్ హత్యను రాజకీయాలకు వాడుకోవద్దు..
- హద్దులు దాటితే చట్టపరమైన చర్యలు తప్పవని బీఆర్ఎస్ నేతల హెచ్చరిక

**నిజామాబాద్, ఆగస్టు 26 (జనసంఘర్షణ):** తగిలేపల్లి మాజీ సర్పంచ్ వెంకటేష్ హత్య ఘటనను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. హత్య ఘటనపై పోచారం భాస్కర్‌రెడ్డి వ్యవహరించిన తీరుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వర్ని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. వెంకటేష్ హత్య ఘటనపై పోచారం భాస్కర్‌రెడ్డి రాస్తారోకో నిర్వహించడంతో పాటు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు బాజిరెడ్డి గోవర్ధన్‌పై విమర్శలు చేయడం, ఆయన దిష్టిబొమ్మను దహనం చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. హత్య ఘటనతో బాజిరెడ్డి గోవర్ధన్‌కు ఎలాంటి సంబంధం లేదని, అయినప్పటికీ ఆయనను లక్ష్యంగా చేసుకుని రాజకీయ ఆరోపణలు చేయడం ద్వారా అసలు సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

**హత్య ఘటనను రాజకీయాలకు వాడొద్దు**

సున్నితమైన హత్య ఘటనను రాజకీయ ప్రయోజనాలకు వినియోగించడం వల్ల ప్రజల్లో అనవసర ఉద్రిక్తతలు తలెత్తే అవకాశం ఉందని బీఆర్ఎస్ నేతలు అన్నారు. హత్యకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి పోచారం శ్రీనివాస్‌రెడ్డితో సంబంధాలు ఉన్నాయని తాము చెబుతున్నామని పేర్కొంటూ, ముందుగా ఘటనకు సంబంధించిన వాస్తవాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందన్నారు.




"వెంకటేష్ హత్యపై రాజకీయ రంగు పులమకుండా బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలి. వ్యక్తిగత రాజకీయ కక్షల కోసం దిష్టిబొమ్మలు దహనం చేయడం, ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం మానుకోవాలి" అని బీఆర్ఎస్ నాయకులు సూచించారు.

**భాస్కర్‌రెడ్డికి బీఆర్ఎస్ నేతల హెచ్చరిక**

పోచారం భాస్కర్‌రెడ్డి ఇకపై రాజకీయ విమర్శలను హద్దుల్లో ఉంచుకోవాలని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. ప్రజలను రెచ్చగొట్టేలా లేదా ఇతర నాయకుల ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరిస్తే చట్టపరమైన మార్గంలో గట్టిగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. రాజకీయ విభేదాలను వ్యక్తిగత కక్షలుగా మార్చి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితులు సృష్టిస్తే సహించేది లేదన్నారు. హత్య ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి అసలు కారణాలను వెలుగులోకి తీసుకురావాలని, నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదే సమయంలో హత్య ఘటనను అడ్డుపెట్టుకుని రాజకీయ ఉద్రిక్తతలకు కారణమయ్యే ప్రయత్నాలు చేసే వారిపైనా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**పోలీసులకు ఫిర్యాదు...**

పోచారం భాస్కర్‌రెడ్డి వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా ఏమైనా జరిగి ఉంటే సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేయాలని కోరుతూ వర్ని పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు జుబేర్, అంజిరెడ్డి, బీర్కూర్ సర్పంచ్ ధర్మ తేజ, తెల్ల రవికుమార్, సమీర్, హకీమ్, బీఆర్ఎస్వీ కోఆర్డినేటర్ ఏజాజ్, మాజీ ఎంపీటీసీ నాగభూషణం, రుద్రూర్ రవికుమార్, శివ, సంతోష్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# తుడుం దేబ్బ మండల కమిటీ ఎన్నికలు

- నార్నూర్ విద్యార్థి సంఘం



**ఆదిలాబాద్ జిల్లా, నార్నూర్ మండలం, ఆగష్టు 26(జనసంఘర్షణ):** ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు తుడుం దెబ్బ, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తుడుం దెబ్బ, ఆదివాసీ విద్యార్థి సంఘం నార్నూర్ మండల కమిటీలు ఏకగ్రీవంగా ఏనుకోవడం జరిగింది. తుడుందెబ్బ గౌరవ అధ్యక్షులు మడవి మాన్కు, అధ్యక్షులు ఆడ శ్రీరామ్, ప్రధాన కార్యదర్శి మడవి సాగర్, కార్యనిర్వాహన అధ్యక్షులు మెస్రం మోతిరం, ఉపాధ్యక్షులు సుర్పం నాగోరావ్, పెందుర్ సుంగు, కార్యదర్శి తొడసం సోంజీ, ఆత్రం లక్ష్మన్, సాంస్కృతిక కార్యదర్శి పూసం ఆనంద్, కోశాధికారి ఆత్రం రమేష్, సలహాదారులు కుర్సెంగా నగేష్, కుంరం ధన్ రాజ్ ఆదివాసీ విద్యార్థి సంఘం నార్నూర్ మండల కమిటీ ఎన్నిక గౌరవ అధ్యక్షులు పెందుర్ క్రిష్ణ, అధ్యక్షులు రాయి సిడం హరీష్, ప్రదాన కార్యదర్శి కొట్నాక్ శ్రీరామ్, కార్యనిర్వాహన అధ్యక్షులు ఊర్వత కృష్ణ, ఉపాధ్యక్షులు కనక తుల్సిరామ్, కోశాధికారి మరప సందీప్, సలహాదారులు మెస్రం కిరణ్, ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నార్నూర్ జేఏసీ చైర్మన్ మెస్రం రూప్ దేవ్ పటేల్ తుడుం దెబ్బ రాష్ట్ర కార్య నిర్వహణ అధ్యక్షులు పూర్క బాపూరావు, తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు పెందుర్ దాదిరావ్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పెందుర్ సంతోష్, తుడుం దెబ్బ జిల్లా ప్రదాన కార్యదర్శి పూర్క చిత్రు, విద్యార్థి సంఘం జిల్లా కార్యనిర్వాహన అధ్యక్షులు కనక గణేష్, విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందుర్ దీపక్,లక్స్మయిట్ పెట్ సర్మేడి సలం శ్యాంరావ్, సర్పంచ్ ఆదివాసీ పోరం మాడవి పైకు ఏంపల్లి పెందోర్ లక్షమన్, సుంగాపూర్ సర్పంచ్ కుంరం దర్ము,చొర్గం సర్పంచ్ మెస్రం చందు, సర్పంచ్ జాండా, ఆదివాసీ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఇన్‌చార్జి బాజిరెడ్డిపై వ్యాఖ్యలు..

- పోచారం భాస్కర్‌రెడ్డిపై ఫిర్యాదు
- అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ బాన్సువాడ బీఆర్ఎస్ నేతల పోలీసులకు ఫిర్యాదు

**బాన్సువాడ, ఆగస్టు 26 (జనసంఘర్షణ):**




బాన్సువాడ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి బాజిరెడ్డి అన్నపై పోచారం భాస్కర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ పార్టీ నేతలు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం బాన్సువాడ పోలీస్ స్టేషన్‌లో పోచారం భాస్కర్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు. బాజిరెడ్డి అన్నను ఉద్దేశించి అనుచితంగా, నిరాధారంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. రాజకీయ విమర్శలు చేయడంలో అభ్యంతరం లేదని, అయితే వ్యక్తిగతంగా అవమానించేలా వ్యాఖ్యలు చేయడం తగదని వారు స్పష్టం చేశారు. పోచారం భాస్కర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను పోలీసులు పరిశీలించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదులో కోరారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

# పోతంగల్‌లో ఘనంగా ఈద్-ఎ-మిలాద్-ఉన్-నబీ వేడుకలు

- డాక్టర్ ఎంఏ హకీమ్ పాల్గొని శుభాకాంక్షలు..
- ఘనంగా సన్మానం

**పోతంగల్/, ఆగస్టు 26/ (జనసంఘర్షణ):**





మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని ఈద్-ఎ-మిలాద్-ఉన్-నబీ పర్వదిన వేడుకలను పోతంగల్‌లో ముస్లిం సోదరులు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మిలాద్-ఎ-నబీ యాత్రను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. యువకులు, మత పెద్దలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా.. పోతంగల్ మండల బీఆర్ఎస్ నాయకులు, సామాజిక సేవకులు డాక్టర్ ఎంఏ హకీమ్ హాజరై ముస్లిం సోదర, సోదరీమణులకు ఈద్-ఎ-మిలాద్-ఉన్-నబీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామ పెద్దలు, ముస్లిం మత పెద్దలు డాక్టర్ ఎంఏ హకీమ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. వేడుకల్లో పాల్గొన్న వారికి సీట్లు, తినుబండారాలు పంపిణీ చేస్తూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

**ప్రవక్త బోధనలు ప్రతి ఒక్కరికీ ఆదర్శం**

ఈ సందర్భంగా డాక్టర్ ఎంఏ హకీమ్ మాట్లాడుతూ.. మహమ్మద్ ప్రవక్త ప్రపంచానికి చాటిచెప్పిన శాంతి, కరుణ, సోదరభావం, సమానత్వం, మానవత్వం వంటి గొప్ప సందేశాలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని కోరారు. పేదలు, నిరుపేదలకు అండగా నిలవడంతో పాటు తోటివారి పట్ల దయతో మెలగాలని, కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేస్తూ ప్రవక్త చూపిన ఆదర్శ మార్గాన్ని అనుసరించాలని సూచించారు. నిజామాబాద్ జిల్లా అనాదిగా మత సామరస్యానికి, గంగా-జమునా తెహజీబ్‌కు ప్రతీకగా నిలుస్తోందని డాక్టర్ హకీమ్ పేర్కొన్నారు. అన్ని మతాల ప్రజలు పరస్పరం గౌరవించుకుంటూ సోదరభావంతో పండుగలను జరుపుకోవడం అభినందనీయమన్నారు. పోతంగల్‌లో హిందూ, ముస్లిం సోదరులు కలిసి వేడుకల్లో పాల్గొనడం ఐక్యతకు, మతసామరస్యానికి చక్కని నిదర్శనమని అన్నారు. ఈద్-ఎ-మిలాద్-ఉన్-నబీ సందర్భంగా పోతంగల్ గ్రామస్తులతో పాటు నిజామాబాద్ జిల్లా ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లిం సోదర, సోదరీమణులకు డాక్టర్ ఎంఏ హకీమ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో, గంధపు పవన్, మాజీ ఎంపీపీ, మాజీ ఎంపీటీసీ వీరేశం, మాజీ సర్పంచ్ రమేష్ సెట్, గంట్ల విటల్, రాజు, దత్తు, రవి, జుమ్మా ఖాన్, నబీ సాహెబ్, సయ్యద్ అస్లాం (సుల్తాన్), రజాక్ సాహెబ్, మహమ్మద్ కలీం, మహమ్మద్ మన్సూర్, సలీమ్ ఆథర్, మహమ్మద్ అజ్మత్, షేక్ ఖాజా మైనుద్దీన్, మహమ్మద్ ఫహీమ్, మహమ్మద్ ముషీర్, మహమ్మద్ జహీర్, మహమ్మద్ ముస్తాక్, అహ్తెషామ్ దేశీ, షేక్ మహ్మద్, అమ్జద్ ఖాన్‌తో పాటు గ్రామ పెద్దలు, ముస్లిం మత పెద్దలు, యువకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కోటగిరిలో పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మర్యాదపూర్వక కలయిక

◆ హౌగిర్రావ్ పటేల్ నివాసంలో ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

కోటగిరి,/ ఆగస్టు 26/ (జనసంఘర్షణ):



తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే గౌరవ పోచారం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం కోటగిరి మండలానికి విచ్చేశారు. ఈ సందర్భంగా హౌగిర్రావ్ పటేల్ నివాసానికి చేరుకున్న ఆయనను స్థానిక నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్‌రెడ్డిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం మండలంలోని ప్రస్తుత పరిస్థితులు, ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై నాయకులు ఆయనతో చర్చించారు. కార్యకర్తలు, నాయకులతో ఆత్మీయంగా ముచ్చటించిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వర్ని: కంట్లో కారం చల్లి 3 తులాల బంగారం చోరీ

◆ ఒంటరిగా ఉన్న మహిళపై దాడి..
◆ ఆభరణం అపహరణ

వర్ని, ఆగస్టు 26 (జనసంఘర్షణ):




ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై దుండగురాలు దాడి చేసి బంగారు ఆభరణం అపహరించిన ఘటన వర్ని మండలం జలాల్‌పూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కవిత ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన మరో మహిళ ఇంట్లోకి చొరబడి కంట్లో కారం చల్లి మెడలో ఉన్న సుమారు 3 తులాల బంగారు ఆభరణాన్ని అపహరించినట్లు వర్ని ఎస్ఐ వంశీకృష్ణారెడ్డి తెలిపారు. మధ్యాహ్నం సమయంలో కవిత ఇంట్లో ఒంటరిగా ఉండటాన్ని గమనించిన మహిళ పథకం ప్రకారం ఇంట్లోకి ప్రవేశించి ఈ ఘటనకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తూ నిందితురాలిని గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

**ఒంటరిగా ఉన్న సమయంలో అప్రమత్తంగా ఉండాలి**

ఇళ్లలో మహిళలు ఒంటరిగా ఉన్న సమయంలో అపరిచితులు లేదా అనుమానాస్పద వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. ఇంటి పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, విలువైన బంగారు ఆభరణాలను బహిరంగంగా ధరించి ఒంటరిగా వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

## బాల్కొండలో గంజాయి సేవిస్తున్న 31 మంది అరెస్టు

◆ గంజాయి విక్రయదారుడి వద్ద 40 గ్రాముల ఎండు గంజాయి, మొబైల్ స్వాధీనం

బాల్కొండ, ఆగస్టు 26 (జనసంఘర్షణ):




గంజాయి సేవిస్తూ పట్టుబడిన 31 మంది యువకులను బాల్కొండ పోలీసులు అరెస్టు చేశారు. గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి 40 గ్రాముల ఎండు గంజాయి, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శైలేందర్ తెలిపారు. బాల్కొండ పరిధిలో గంజాయి వినియోగం, విక్రయాలపై నిఘా ఉంచిన పోలీసులు తనిఖీలు నిర్వహించగా గంజాయి సేవిస్తున్న 31 మంది యువకులు పట్టుబడ్డారని చెప్పారు. విచారణలో గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తి వివరాలు వెలుగులోకి రావడంతో అతడిని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

**డీ-అడిక్షన్ కేంద్రాలకు తరలించే చర్యలు**

గంజాయి సేవిస్తున్న యువకులపై కేసులు నమోదు చేసి, వారిని మత్తు పదార్థాల వ్యసనం నుంచి బయటపడేలా డీ-అడిక్షన్ కేంద్రాలకు పంపే దిశగా చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ శైలేందర్ తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి విక్రయాలు, వినియోగానికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**గంజాయిపై కఠిన నిఘా**

బాల్కొండ పరిధిలో గంజాయి విక్రయాలు, వినియోగంపై నిరంతరం నిఘా కొనసాగుతుందని పోలీసులు తెలిపారు. గంజాయి విక్రయించే లేదా వినియోగించే వ్యక్తుల సమాచారం ప్రజలకు తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని, యువత భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

# బాజిరెడ్డి గోవర్ధన్ దిష్టిబొమ్మ దహనంపై బీఆర్ఎస్ ఫిర్యాదు

◆ కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని బోధన్ ఏసీపీకి వినతి

కోటగిరి, /ఆగస్టు 26/ (జనసంఘర్షణ):

బాన్సువాడ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ దిష్టిబొమ్మను దహనం చేసిన ఘటనపై బీఆర్ఎస్ శ్రేణులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం వర్ని చౌరస్తాలో బాన్సువాడ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రాజకీయ కక్షతో బాజిరెడ్డి గోవర్ధన్ దిష్టిబొమ్మను దహనం చేశారని ఆరోపిస్తూ బుధవారం కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌కు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ రాజకీయ విభేదాల పేరుతో నేతల దిష్టిబొమ్మలు దహనం చేయడం సరికాదన్నారు. ఘటనకు బాధ్యులైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏసీపీని కోరారు.

**చర్యలు తీసుకోకపోతే ఆందోళన....**

బాజిరెడ్డి గోవర్ధన్ దిష్టిబొమ్మ దహనం చేసిన వారిపై తక్షణమే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. పోలీసులు స్పందించకపోతే ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. రాజకీయ కక్షలకు తావులేకుండా పోలీసులు ఇరువర్గాలపై సమానంగా చట్టాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బాన్సువాడ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబెర్, అంజిరెడ్డి, సాయిబాబా, కోటగిరి మండల నాయకులు తెల్ల రవికుమార్, మోరే కిషన్, వల్లేపల్లి శ్రీనివాసరావు, బిఆర్ఎస్ పెద్దలు, డాక్టర్ ఎంఏ హకీమ్, నవీన్, కప్ప సంతోష్, బీర్కూర్ సర్పంచ్ ధర్మతేజ, చిన్న అరవింద్, వర్ని ఏజాజ్, దాస్, అజ్మీర్ కిషన్‌తో పాటు వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు, బీఆర్ఎస్ శ్రేణులు






## కారేగాం తండాలో పట్టపగలే చోరీ

◆ బంగారం, వెండి ఆభరణాలు, నగదు అపహరణ..
◆ సీసీ కెమెరాల ఆధారంగా పోలీసుల దర్యాప్తు

బాన్సువాడ,/ ఆగస్టు 26/ (జనసంఘర్షణ):



నిజామాబాద్ జిల్లా చందూర్ మండలం కారేగాం తండాలో పట్టపగలే చోరీ జరిగింది. ఇంటి యజమాని పక్కింటికి వెళ్లిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువా తాళం పగులగొట్టి బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరించిన ఘటన కలకలం రేపింది. తండాకు చెందిన అనిత ఇంటికి గొళ్లెం వేసి పక్కింటికి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చి చూడగా బీరువా తాళం పగిలి ఉండటాన్ని గమనించింది. బీరువాలో ఉన్న సుమారు 2.5 తులాల బంగారం, 28 తులాల వెండి ఆభరణాలు, రూ.లక్ష నగదు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించింది.

**సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు**

బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీకి సంబంధించిన దృశ్యాలు పరిసరాల్లోని సీసీ కెమెరాల్లో నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. వాటి ఆధారంగా అనుమానితులను గుర్తించి పట్టుకునేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..**

పట్టపగలు చోరీ జరగడంతో తండావాసుల్లో ఆందోళన నెలకొంది. ఇళ్లను వదిలి బయటకు వెళ్లే సమయంలో తలుపులు, కిటికీలు సురక్షితంగా ఉన్నాయో పరిశీలించుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

## డాక్టర్లు లేరు.. నర్సులతోనే వైద్యం!

◆ వావిలాల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల కొరత.. పేద రోగులకు తప్పని ఇబ్బందులు

జమ్మికుంట/, ఆగస్టు 26/ (జనసంఘర్షణ):



జమ్మికుంట మండలం వావిలాల గ్రామంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు అందుబాటులో లేకపోవడంతో నర్సులే వైద్య సేవలు అందిస్తున్న పరిస్థితి నెలకొందని ఆరోపిస్తున్నారు. అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు సరైన వైద్య సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. వావిలాల గ్రామం మండల కేంద్రానికి కొంత దూరంగా ఉండటంతో అత్యవసర వైద్యం కోసం ఇతర ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోందని, ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తే అధిక ఖర్చులు భరించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


**వైద్యుల కొరతపై అధికారులు స్పందించాలి**

ప్రభుత్వ ఆసుపత్రి ఉన్నప్పటికీ వైద్యులు అందుబాటులో లేకపోవడం వల్ల దాని ప్రయోజనం ప్రజలకు పూర్తిస్థాయిలో అందడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో వైద్యుల సేవలు అందుబాటులో లేకపోవడం రోగులకు ఇబ్బందికరంగా మారుతోందన్నారు. సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వావిలాల ప్రభుత్వ ఆసుపత్రిలో శాశ్వత వైద్యులను నియమించడంతో పాటు అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు బలోపేతం చేసి పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వైద్యుల నియామకంలో జాప్యం చేస్తే ప్రజల ఆరోగ్య భద్రతపై ప్రభావం పడే అవకాశం ఉందని, ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

# పోతంగల్ నుంచి మహారాష్ట్రకు అక్రమంగా బియ్యం తరలింపు?

◆ రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా కరువు..
◆ ప్రతిరోజూ తరలిస్తున్నారన్న ఆరోపణలు..
◆ ఈ మోటార్ వెహికల్ రోజుకు 15 కుంటలు తీసుకెళ్తాడు..!
◆ ఎవడైతే నాకేంటి నా దందా నాకు అక్రమాపియా దందా బియ్యం మహారాష్ట్రకు తరలింపు..

పోతంగల్,/ ఆగస్టు 26 /(జనసంఘర్షణ):





పోతంగల్ మండల కేంద్రం నుంచి రేషన్ బియ్యం మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం అందించే కార్యక్రమంలో భాగంగా రేషన్ డీలర్లకు మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి సరఫరా చేయడంతో కొందరు అక్రమార్కులు దీన్ని ఆసరాగా చేసుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికుల ఆరోపణల ప్రకారం మహారాష్ట్రకు చెందిన కొందరు వ్యక్తులు పోతంగల్ పరిధి నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి సరిహద్దు దాటి మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతిరోజూ పెద్ద మొత్తంలో బియ్యం వాహనాల ద్వారా తరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

**చెక్‌పోస్టుల మీదుగా యథేచ్ఛగా తరలింపు?**

పోతంగల్ నుంచి మహారాష్ట్ర వైపు వెళ్లే మార్గాల్లో వాహనాల తనిఖీలు జరుగుతున్నప్పటికీ అక్రమంగా బియ్యం తరలిస్తున్న వాహనాలు ఎలా వెళ్తున్నాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా మోటార్ వెహికల్ చెక్‌పోస్టుల పరిధిలో నుంచి బియ్యం రవాణా జరుగుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ప్రతిరోజూ భారీ మొత్తంలో బియ్యం తరలిస్తున్నారన్న ఆరోపణలపై అధికారులు సమగ్రంగా దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు బియ్యం తరలింపునకు సంబంధించిన ఫొటోలు, చిత్రాలు కూడా వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. వాటి ఆధారంగా అధికారులు వాహనాల వివరాలు, బియ్యం ఎక్కడి నుంచి వస్తోంది, ఎక్కడికి తరలిస్తున్నారు, రవాణాకు సంబంధించిన అనుమతులు ఉన్నాయా అనే అంశాలపై విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

**అధికారులు స్పందించాలి..**

ప్రభుత్వం పేద ప్రజలకు అందించాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా పౌరసరఫరాల శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం | తెలుగు దినపత్రిక
గురువారం 27 ఆగస్టు 2026

# తెలంగాణ రక్షణ సేనలోకి పలువురు కార్యకర్తల చేరిక

- దొంగ్లి మండలంలో పార్టీ జెండా ఆవిష్కరణ..
- ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యం

దొంగ్లి, /ఆగస్టు 26/ (జనసంఘర్షణ): దొంగ్లి మండల కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు తెలంగాణ రక్షణ సేనలో చేరగా, పార్టీ నాయకులు వారికి కండువాలు కప్పి సాదరంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ వేణు మాధవ్, రాష్ట్ర నాయకులు సురేష్ గౌడ్, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు, యూత్ అధ్యక్షులు ఆదిల్, కామారెడ్డి జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎం. సాయిలు, జుక్కల్ కార్యకర్త రమేష్, బిచ్కుంద మహిళా అధ్యక్షురాలు మాధవి, దొంగ్లి మండల అధ్యక్షులు మారుతి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం**



ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రక్షణ సేన ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని పేర్కొన్నారు. పార్టీలో నూతనంగా చేరిన కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రక్షణ సేనలో చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని, ప్రజా సమస్యలపై నిబద్ధతతో పనిచేసే ప్రతి ఒక్కరికీ పార్టీలో తగిన ప్రాధాన్యత ఉంటుందని నాయకులు తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాటమే తెలంగాణ రక్షణ సేన లక్ష్యమని మద్నూర్ మండల అధ్యక్షులు బండివార్ పేర్కొన్నారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, నూతనంగా పార్టీలో చేరిన వారు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నీళ్లు ఎత్తిపోతలపై నిర్ణయం సర్కారుదే

- హైకోర్టుకు తెలిపిన ఎన్‌డీఎస్ఏ.. కాళేశ్వరంలో నీళ్లు నింపడంపై రాష్ట్రానిదే తుది నిర్ణయం

హైదరాబాద్,/ ఆగస్టు 26/ (జనసంఘర్షణ): కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని ఎత్తిపోసే అంశంపై నిర్ణయం తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానిదేనని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) హైకోర్టుకు స్పష్టం చేసినట్లు బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. అవసరానికి అనుగుణంగా కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని ఎత్తిపోసుకోవాలా? వద్దా? అనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవచ్చని ఎన్‌డీఎస్ఏ తన అఫిడవిట్‌లో తెలిపినట్లు వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని నింపడం, అవసరమైన మేరకు నీటిని ఎత్తిపోసుకోవడం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని ఎన్‌డీఎస్ఏ స్పష్టం చేసిందని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కోరిన మేరకు ఎన్‌డీఎస్ఏ నుంచి అవసరమైన సాంకేతిక సహకారం అందించామని పేర్కొన్నట్లు చెప్పారు.

**కుట్రలు మరోసారి బట్టబయలు**

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నీటిని ఎత్తిపోసే నిర్ణయం తీసుకుంటే దానిపై ఎన్‌డీఎస్ఏను నిందించడం సరికాదని అఫిడవిట్‌లో స్పష్టం చేసినట్లు బీఆర్ఎస్ వర్గాలు పేర్కొన్నాయి. ప్రాజెక్టు నిర్వహణకు సంబంధించి తమ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందించామని ఎన్‌డీఎస్ఏ తెలిపిందని అన్నారు. కాళేశ్వరం విషయంలో ప్రతిపక్షాలపై రాజకీయ ఆరోపణలు చేయడం, సాంకేతిక సంస్థలపై నిందలు వేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. హైకోర్టులో ఎన్‌డీఎస్ఏ దాఖలు చేసిన అఫిడవిట్‌తో వాస్తవాలు మరోసారి వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు.

**నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వానిదే**

అవసరం మేరకు కాళేశ్వరం లిఫ్టింగ్ వ్యవస్థను వినియోగించుకోవడం, ప్రాజెక్టులో నీటిని నింపడం వంటి అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలో నిర్ణయం తీసుకోవచ్చని ఎన్‌డీఎస్ఏ స్పష్టం చేసిందని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ప్రజలకు వాస్తవాలను వెల్లడించి, రాజకీయ ఆరోపణలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు.




# పోతంగల్‌లో 27న గ్రామసభలు...

- ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన..
- మీడియా మిత్రులకు తహసీల్దార్ ఆహ్వానం

పోతంగల్,/ ఆగస్టు 26/ (జనసంఘర్షణ): భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న లిప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లిలో భాగంగా పోతంగల్ మండలంలోని సంబంధిత గ్రామాల్లో గురువారం (ఆగస్టు 27) గ్రామసభలు, వార్డుసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ గ్రామసభలు, వార్డుసభల్లో ముసాయిదా.... ఓటర్ల జాబితా పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల వివరాల్లో సవరణలు, అభ్యంతరాల స్వీకరణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించ నున్నారు. ఓటర్ల జాబితాలో తమ పేరు, వివరాలు సక్రమంగా ఉన్నాయో పరిశీలించుకుని, మార్పులు లేదా సవరణలు అవసరమైతే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించనున్నారు.



**మీడియా మిత్రులకు ఆహ్వానం...**


ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు పోతంగల్ మండలంలోని ముద్రిత, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు గ్రామసభలు, వార్డుసభలకు హాజరై కార్యక్రమాలను కవరేజ్ చేయాలని తహసీల్దార్ కోరారు. ప్రతి అర్హుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించడంలో మీడియా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఓటు హక్కు కలిగిన ప్రతి పౌరుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటర్ల జాబితాలో తన పేరు, వివరాలను పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు.

తేదీ: 27.08.2026
స్థలం: సంబంధిత గ్రామ పంచాయతీ భవనం....
ఇట్లు.. తహసీల్దార్ పోతంగల్ మండలం పేర్కొన్నారు

# పోతంగల్‌లో ప్రత్యేక గ్రామసభ

- ఓటర్ల జాబితా పరిశీలన.. కొత్త ఓటర్ల నమోదు, సవరణలకు అవకాశం

పోతంగల్, /ఆగస్టు 26/ (జనసంఘర్షణ): పోతంగల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం (ఆగస్టు 27) ప్రత్యేక గ్రామసభ నిర్వహించనున్నట్లు గ్రామ సెక్రెటరీ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ సభ జరుగుతుందని పేర్కొన్నారు. ప్రత్యేక గ్రామసభలో ఓటర్ల జాబితాను పరిశీలించడంతో పాటు కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల వివరాల్లో సవరణలు, అభ్యంతరాలు, అనర్హుల పేర్ల తొలగింపు తదితర అంశాలపై చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండే యువతీ, యువకులు కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు.




**ప్రతి ఒక్కరూ హాజరుకావాలి..**

గ్రామ ప్రజలు, ఓటర్లు తమ పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని, పేర్లు లేకపోతే నమోదు చేసుకోవడంతో పాటు తప్పులు ఉంటే సరిచేసుకునేందుకు గ్రామసభను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ప్రత్యేక గ్రామసభకు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) హాజరుకానున్నారు. గ్రామస్తులు, యువతీ యువకులు అందరూ తప్పక హాజరై ఓటర్ల జాబితాకు సంబంధించిన అంశాలను పరిశీలించుకోవాలని గ్రామ సెక్రెటరీ కోరారు.

తేదీ: 27.08.2026
సమయం: ఉదయం 10 గంటల నుంచి
వేదిక: గ్రామ పంచాయతీ కార్యాలయం
ఇట్లు..పోతంగల్ గ్రామ సెక్రెటరీ పేర్కొన్నారు.

# ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలి ధర్నా

- పెళ్లి పేరుతో గర్భవతిని చేసి మోసం చేశాడని ఆరోపణ..
- న్యాయం కోసం బాధితురాలి ఆందోళన

బూర్గంపాడు, /ఆగస్టు 26 /(జనసంఘర్షణ): ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనను గర్భవతిని చేసి మోసం చేశాడని ఆరోపిస్తూ ఓ యువతి ప్రియుడి ఇంటి ఎదుట ఆందోళనకు దిగిన ఘటన బుధవారం బూర్గంపాడు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో చోటుచేసుకుంది. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ యువతి ప్రియుడిని, అతడి కుటుంబ సభ్యులను నిలదీయడంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని మొరంపల్లిబంజర గ్రామానికి చెందిన ధారా శివాని (26) ప్రైవేట్ నర్సుగా పనిచేస్తోంది. బూర్గంపాడు ఎస్సీ కాలనీకి చెందిన లితోకల సాయి (28)లితో ఆమెకు పరిచయం ఏర్పడింది. సాయి ప్రస్తుతం ఢిల్లీలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం.



**పెళ్లి చేసుకుంటానని నమ్మించి...**

తమ పరిచయం కొంతకాలానికి ప్రేమగా మారిందని బాధితురాలు తెలిపింది. లితనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి సాయి ఢిల్లీకి తీసుకెళ్లాడని, అక్కడ తనతో సన్నిహితంగా మెలగడంతో తాను గర్భవతిని అయ్యానని ఆరోపించింది. అనంతరం ఢిల్లీలోని ఆసుపత్రుల చుట్టూ తిప్పాడని, పెళ్లి విషయాన్ని ప్రస్తావించినప్పుడల్లా హామీలు ఇచ్చాడని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. అయితే సొంత గ్రామానికి తిరిగి వచ్చిన తర్వాత తనతో ఎలాంటి సంబంధం లేదంటూ సాయి ముఖం చాటేస్తున్నాడని బాధితురాలు ఆరోపించింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె బుధవారం బూర్గంపాడులోని సాయి ఇంటికి చేరుకుని తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులను, సాయిని నిలదీసింది.

**న్యాయం చేయాలని డిమాండ్**

తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని, తన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని న్యాయం చేయాలని బాధితురాలు కోరుతోంది. ఘటనపై పోలీసులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. బాధితురాలి ఆరోపణలపై పోలీసులు విచారణ చేపట్టి, ఇరువర్గాల నుంచి వివరాలు సేకరించిన అనంతరం చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఘటనతో బూర్గంపాడు ఎస్సీ కాలనీలో చర్చనీయాంశంగా మారింది.

# ఖమ్మంలో పోక్సో కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

- మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో కోర్టు సంచలన తీర్పు..
- నిందితులకు జరిమానా

ఖమ్మం,/ ఆగస్టు 26/ (జనసంఘర్షణ): మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో ముగ్గురు నిందితులకు ఖమ్మం జిల్లా ఫాస్ట్‌ట్రాక్ (పోక్సో) కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. 2022 నవంబర్‌లో చింతకాని పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకోగా, బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు సేకరించిన సాక్ష్యాలు, శాస్త్రీయ ఆధారాలు, బాధితురాలి వాంగ్మూలంతో పాటు ఇతర ఆధారాలను కోర్టు ముందు పక్కాగా సమర్పించారు. కేసును విచారించిన ఖమ్మం జిల్లా ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ పుల్లాభట్ల పొగడ కృష్ణార్జున్ ముగ్గురు నిందితులను దోషులుగా నిర్ధారించారు. నిందితులకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నేరానికి పాల్పడిన వారికి చట్టం ప్రకారం కఠిన శిక్షలు తప్పవని ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసింది.



**నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు**

మైనర్ బాలికలు, చిన్నారులపై లైంగిక వేధింపులు, దాడులకు పాల్పడే వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని జిల్లా పోలీసు అధికారులు హెచ్చరించారు. బాధితులకు న్యాయం జరిగేలా కేసుల్లో పక్కా ఆధారాలను సేకరించి కోర్టుల్లో సమర్థవంతంగా వాదనలు వినిపించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా కీలక ఆధారాలను కోర్టు ముందు సమర్పించిన పోలీసు అధికారులు, దర్యాప్తు సిబ్బంది, ప్రాసిక్యూషన్ బృందాన్ని జిల్లా పోలీసు యంత్రాంగం అభినందించింది. బాలికలు, చిన్నారుల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, అనుమానాస్పద ఘటనలు లేదా వేధింపులు గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# సర్పంచ్ ధర్మతేజకు ఘన సన్మానం

- వల్లేపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం

కోటగిరి, ఆగస్టు 26 (జనసంఘర్షణ): బీర్కూర్ సర్పంచ్ ధర్మతేజను ఘనంగా సన్మానించిన కార్యక్రమం నిర్వహించారు. కోటగిరి మండల మాజీ ఎంపీపీ వల్లేపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ధర్మతేజను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వల్లేపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో పనిచేయాలని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. సన్మానం అందుకున్న సర్పంచ్ ధర్మతేజ మాట్లాడుతూ తనపై చూపిన అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సహకారంతో గ్రామాభివృద్ధికి మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంజిరెడ్డి, చిన్న అరవింద్, సామాజిక సేవకులు డాక్టర్ ఎంఏ హకీమ్‌తో పాటు పలువురు నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## త్వరలో రాబోతున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి ప్రభుత్వం విజయ లక్ష్యంగా పనిచేయాలి... ఎమ్మెల్యే బొజ్జల



**శ్రీకాళహస్తి ఆగస్టు26 (జన సంఘర్షణ):**
శ్రీకాళహస్తి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణ త్వరలో రాబోతున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి విజయమే లక్ష్యంగా శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సుదీర్ఘంగా, లోతుగా చర్చించారు. తిరుపతి పార్లమెంటు అధ్యక్షురాలు పనబాక లక్ష్మి అధ్యక్షతన తిరుపతి జిల్లాకు చెందిన ముఖ్య నేతలు, నియోజకవర్గ స్థాయి నాయకులతో కలిసి ఈ అత్యంత ప్రాధాన్యత కలిగిన సమావేశం జరిగింది. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల దిశగా పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు దిశానిర్దేశం చేశారు. ప్రతి పంచాయతీ, వార్డు స్థాయిలో నాయకులు, కార్యకర్తలు ఏకతాటిపైకి వచ్చి ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. తిరుపతి పార్లమెంటు అధ్యక్షురాలు పనబాక లక్ష్మి మాట్లాడుతూ.. తిరుపతి జిల్లావ్యాప్తంగా కూటమి నాయకులు సమన్వయంతో పనిచేస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడమే ధ్యేయంగా ముందుకు సాగాలని సూచించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి నాయకత్వంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, నియోజకవర్గాన్ని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడానికి ప్రజాప్రతినిధులు, నాయకులు సమిష్టిగా కృషి చేయాలని కోరారు.

## ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారుల పరామర్శ



**కుప్పం,ఆగస్టు 26 (జన సంఘర్షణ):**
కుప్పం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కంగుంది పంచాయతీకి చెందిన ఆరుగురు చిన్నారులను బుధవారం ప్రాంతీయ వైద్యశాల వైస్ చైర్మన్ భారతి త్రిలోక్ నాయుడు పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పరామర్శించారు. విషపూరితమైన కాయను తినడంతో అస్వస్థతకు గురైన ఆరుగురు చిన్నారులను చికిత్స నిమిత్తం కుప్పం ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. సమయస్ఫూర్తితో స్పందించి, తక్షణమే తగిన వైద్యం అందించిన వైద్యులు మరియు ఆసుపత్రి సిబ్బందికి చిన్నారుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కుప్పం ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కుప్పం నియోజకవర్గం తరుపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## మోడల్ రైతు బజార్ నిర్మాణ పనులకు నేడు మంత్రి లోకేష్ శంకుస్థాపన.

**ప్రగతి పథంలో దూసుకుపోతున్న మంగళగిరి నియోజకవర్గం.**



**కుప్పం,ఆగస్టు 26 (జన సంఘర్షణ):**
రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో మంగళగిరి నియోజకవర్గం పారిశ్రామికంగా, మౌలిక వసతుల పరంగా వేగవంతమైన అభివృద్ధి సాధిస్తూ సంక్షేమంలో దూసుకుపోతోంది. మంగళగిరి ప్రజలు, స్థానిక రైతుల సౌకర్యార్థం పట్టణంలోని నిడమర్రు రైల్వే గేట్ సమీపంలో రూపుదిద్దుకోనున్న మోడల్ రైతు బజార్ నిర్మాణానికి ఆయన శ్రీకారం చుట్టారు. రిటైల్, హోల్సేల్ కూరగాయల మార్కెట్గా ఆధునిక హంగులతో చేపట్టనున్న ఈ ప్రతిష్టాత్మక రైతు బజార్ నిర్మాణ పనులకు మంత్రి నారా లోకేష్ గురువారం ఉదయం అధికారికంగా శంకుస్థాపన చేయనున్నారు. దీంతో సర్వత్ర హర్షం వ్యక్తం అవుతున్నది.

## కోదండ రామస్వామి నూతన ఆలయానికి భూమి పూజ

**కార్వేటి నగరం. ఆగస్టు 26 (జన సంఘర్షణ):**
కార్వేటినగరం మేజర్ పంచాయతీ శివాలయం వీధిలో ఉన్న కోదండ రామస్వామి భజన మందిరం నిర్మాణం సంబంధించి బుధవారం ఉదయం 4 5 గంటల మధ్యలో నిర్మాణం శంకుస్థాపన క్షేత్ర శుద్ధి వాస్తు హోమం అంకురార్పణ సీతారామాంజనేయ స్వామి సంబంధించి పూజా కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భజన గుడి కార్యనిర్వక కమిటీ సభ్యులు నీలకంఠారెడ్డి కుటుంబ సభ్యుల గ్రామస్తులు ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు.



## "మిలాద్ ఉన్ నబి"పర్వ జనాన్ని పురస్కరించుకొని జలీల్ అహమ్మద్ సౌజన్యంతో 500 మందికి అన్న వితరణ

**జలీల్ భాయ్ ధాతృత్వాన్ని అభినందించిన ముస్లిం పెద్దలు**

**కోట ఆగస్టు 26 (జన సంఘర్షణ):**
ముస్లిం సమాజంలో "మిలాద్ ఉన్ నబి"పవిత్రంగా భావించే పండగ. ప్రవక్త మహమ్మద్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ పర్వదినాన్ని ముస్లిములు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఈ సందర్భంగా ప్రార్థనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. కుటుంబ సభ్యులు, బంధువులు ,స్నేహితులకు శుభాకాంక్షలు తెలియజేశారు .సమాజంలో శాంతి ,సంతోషం, ఆరోగ్యం , వెల్లి విరియాలని ప్రార్థిస్తారు .ఈ రోజున మహమ్మద్ ప్రవక్త జీవితాన్ని ఆయన బోధనలను గుర్తు చేసుకుంటారు. నిజాయితీ,క్షమ, ప్రేమ సహనం ఇతరులకు సహాయం చేయడం వంటి విలువలకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యతను స్మరించుకుంటారు ప్రార్థనలతో పాటు సేవా కార్యక్రమాలు ఈ సందర్భంగా ప్రాధాన్య చేస్తారు అవసరంలో ఉన్న వారికి అండగా నిలవడం పేదలకు ఆహారం అందించడం ఇతరులకు సాయం చేయడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ పండుగ సందర్భంగా మంచి విలువలను గుర్తుచేసుకునే పవిత్రమైన రోజుగా భావిస్తారు. మన చుట్టూ ఉన్న వారిని గౌరవించడం కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలవడం ఇతరుల పట్ల దయతో వ్యవహరించడం ఈ పండుగ యొక్క ముఖ్య అంశాలు. ఈ సందర్భంగా నే కోట నివాసి అయిన జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు అన్ని సమయాలలో అందరికీ అందుబాటులో ఉన్న వ్యక్తి కోట పట్టణంలో ఏ సమస్య అయినా తన దృష్టికి వస్తే వెంటనే స్పందించి నివృత్తి చేసే దీశాలి అని అందరి నోళ్ళల్లో ఒక మంచి మనసున్న వ్యక్తిగా అభిమానించే తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మన జలీల్ అహ్మద్ అని ఈ సందర్భంగా కొనియాడడం జరిగింది. కోట పట్టణం నార్త్ గిరిజన కాలనీలోని నిరుపేద గిరిజనులకు ఒక మంచి ఆహారం ఆయన అందించడం జరిగింది. అంతేకాక పట్టణంలో ఏ సమస్య తన దృష్టికి వచ్చిన వెంటనే స్పందించి గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ అండదండలతో వీలైతే తన సొంత ఖర్చులు పెట్టైనా ఆ సమస్యను పరిష్కరించే దిశగా నిరంతరం కృషి చేయడం ఆయన అభిమతం.




## వెంగంవారిపల్లి లోరాముని భజన మందిరం ప్రారంభోత్సవానికి రాజకీయ నాయకుల సందడి

**బైరెడ్డిపల్లి , ఆగస్టు26 (జన సంఘర్షణ):**
బైరెడ్డిపల్లి మండలంలోని వెంగంవారిపల్లిలో నిర్మించిన నూతన రాముని భజన మందిరంకి బుధవారం ప్రారంభోత్సవం నిర్వహించారు. సహజంగారాజకీయ పార్టీలకు అతీతంగా గ్రామస్థులు పాల్గొనటం ఆనవాయితి. కానీ త్వరలో స్థానిక ఎన్నికలు రానుడటంతో ప్రధాన పార్టీలముఖ్య నేతలు గ్రామాల్లో ఏమి జరిగిన కార్యక్రమంలకు హాజరవుతు నిర్వాహకులకు ఆశ్చర్యపరుస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తూ అభిమానం చాటుకొంటున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం మండలంలోని వెంగమవారిపల్లి లో నూతనంగా నిర్మించిన రామ భజన మందిరం ప్రారంభోత్సవం కోలాహలంగా కొనసాగింది. ఈ సందర్భంగా అర్చకులు రామకృష్ణమాచార్యులు శాస్త్రోక్తంగా హోమాలు,విశేషపూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల టి.డి.పి. అధ్యక్షుడు కిషోర్ గౌడు,అలాగే వైకాపా రాష్ట్ర కార్యదర్శి,ఎంపీ.పి. అయిన మొగశాల రెడెప్ప వేరువేరుగా పాల్గొన్నారు. ఇరుపార్టీల కీలకనాయకులకు నిర్వాహకులు స్వాగత్తించి ,సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇరుపార్టీల ప్రధాన నాయకులతో పాటుస్థానిక నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఎలైట్ విస్టా ఇన్ఫ్రా వెంచర్ ను ప్రారంభం ప్రారంభించిన ఎమ్మెల్యే మురళీమోహన్


**పూతలపట్టు**



**ఆగస్టు 26 (జన సంఘర్షణ):**
ప్రజలకు అందుబాటులో అధునాతన టెక్నాలజీతో "ఎలైట్. విస్టాఇన్ఫ్రావెంచర్స్ ప్రీమియం లేఔట్స్ ఉన్నాయని స్థానిక ఎమ్మెల్యే కలికిరిమురళీమోహన్ అన్నారు .బుధవారంపూతలపట్టు మండలం పోటుకనుమ పంచాయితీ కోట్లపల్లి ఆర్చి వద్ద కాణిపాకం బోర్డు సభ్యులు ఊట్ల నాగరాజు నాయుడు వేసిన వెంచర్ను ఎమ్మెల్యే పారంభించాడు .ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యాధునిక వసతులతో రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్ట్ అని పట్టణాల్లో ఉండే విధంగా ఇక్కడ అండర్ డ్రైనేజీతో పొల్యూషన్ కంట్రోల్ చేస్తూ వెంచర్ని ఏర్పాటు చేశారని ప్రజలు అందుబాటులో కూడా ఉందన్నారు. కర్నూలు. తిరుపతి. జాతీయ రహదారులకు దగ్గరలో ఈ వెంచర్ఉన్నదని తెలిపాడు. ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే కి నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు ఈ కార్యక్రమంలో. మండల టిడిపి అధ్యక్షులు దొరబాబుచౌదరి. నిర్వాహకులు గుర్రప్ప నాయుడు. దేవేంద్ర. జ్యోతి. తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న... మాజీ ముఖ్యమంత్రి వి.నారాయణస్వామి

**శ్రీకాళహస్తి ఆగస్టు 26: (జన సంఘర్షణ):**
తిరుమల శ్రీవారి దర్శనార్థం సుప్రభాత సేవ, సేవల్లో పాల్గొనేందుకు కుటుంబ సమేతంగా తిరుమలకు పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి, మాజీ కేంద్ర మంత్రి వి. నారాయణస్వామి విచ్చేశారు,వారికి ముందుగా శ్రీకాళహస్తి దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యులు, ప్రముఖ న్యాయవాది వడకలూరు మస్తానయ్య ఘనంగా స్వాగతించి, శ్రీవారి దర్శనానికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయాన్ని కుటుంబ సభ్యులతో కలిసి నారాయణస్వామి దర్శించుకున్నారు, అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, పి ఆర్ ఓ భరత్, జయచంద్ర , నెల్లూరు జగదీష్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## ధైర్యంగా ఉండండి.. జీవితాంతం అండగా ఉంటాం

**వసంత కుమార్ కుటుంబ సభ్యులతో మంత్రినారా లోకేష్**



**చిత్తూరు ఆగస్టు 26 (జన సంఘర్షణ):**
ధైర్యంగా ఉండండి, జీవితాంతంమీకు అన్నివిధాలుగాతోడుంటానని తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ తెదేపా సీనియర్ నాయకుడు చెరుకూరి వసంత కుమార్ కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. బుధవారం చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఫోన్ ద్వారా వసంత్ కుమార్ భార్య శిల్ప, పిల్లలు మోక్షశ్రీ, డమరకేశ్వర్ ఏ దేవాన్ష్ తో ఫోన్లో మాట్లాడారు. జరిగిన సంఘటన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, ఏ సమస్య ఉన్నా, ఎప్పుడైనా తనకు చిన్న సందేశం ఇస్తే మాట్లాడుతానని, జీవితాంతం అండగా ఉంటానన్నారు. పిల్లలు ఇద్దరితో ఆప్యాయంగా మాట్లాడారు. త్వరలో చిత్తూరుకొచ్చి నేరుగా కలిసి మాట్లాడతానని లోకేష్ భరోసా ఇచ్చాడు.


## శ్రావణ ఉత్సవంలో కళ్యాణ వెంకన్న



**నారాయణవనం ఆగస్టు 26 (జన సంఘర్షణ):**
మండల కేంద్రమైన నారాయణవనంలో వెలసిన ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం శ్రీ పద్మావతి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారికి శ్రావణోత్సవం వేడుకగా నిర్వహించారు. ఉదయం నిత్య పూజ కార్యక్రమాలు అనంతరం 10 గంటలకు స్వామి అమ్మవార్లకు అర్చకులు పాలు, పెరుగు, నెయ్యి, కొబ్బరి నీళ్ళు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం వివిధ పుష్పాలతో సూమనహారంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారిని అధిరోహించి ఆలయ మాడవీధులలో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి నాగరాజు, అర్జిత్ ఇన్స్పెక్టర్ భరత్, ఆలయ అర్చకులు శ్రీధర్ భట్టాచార్యులు, శ్రీనివాస భట్టాచార్యులు, ఆలయ సిబ్బంది,వాహన మోతగాళ్లు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి ఛాంపియన్‌షిప్స్ 2026లో పత్తి నిత్యహాసిని ప్రతిభ

**శ్రీకాళహస్తి ఆగస్టు 26 (జన సంఘర్షణ):**
తిరుపతి అమరావతి ఛాంపియన్‌షిప్స్ -- 2026 రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వంశీ కాలేజ్ విద్యార్థిని తిరుపతి జిల్లా, శ్రీకాళహస్తికి చెందిన నిత్య ఫిట్నెస్ సెంటర్ అధినేత జ్యోతిరావు ,రూపా దేవిల కుమార్తె పత్తి నిత్యహాసిని సత్తా చాటింది. అండర్-- 17 బాలికల షాట్‌పుట్ విభాగంలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర ఛాంపియన్‌గా నిలిచింది. ఈ విజయంతో శ్రీకాళహస్తి ప్రాంతానికి, తన తల్లిదండ్రులకు, కోచ్‌లకు గర్వకారణంగా నిలిచింది. రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన నిత్యహాసినిని క్రీడాభిమానులు, స్థానికులు అభినందించారు. వరుస విజయాలతో క్రీడాకారుకు స్ఫూర్తిగా అభినందనలు అందుకుంటుంది.



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
గురువారం
27 ఆగస్టు 2026

## అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



**పలమనేరు, ఆగస్టు 26 (జనసంఘర్షణ):** ఓనం పర్వదినాన్ని పురస్కరించుకుని, స్థానిక కాశీవిశ్వేశ్వర ఆలయ ప్రాంగణంలో కొలువైన శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ పవిత్ర దినం సందర్భంగా ఆలయం భక్తజన సంద్రంగా మారింది. పండుగ వాతావరణం ఉట్టిపడేలా ఆలయ కమిటీ వారు చేసిన ఏర్పాట్లు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వేకువజామునే సుప్రభాత సేవతో ప్రారంభమైన కార్యక్రమాలు, అనంతరం స్వామివారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి తదితర ద్రవ్యాలతో మహా పంచామృతాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారిని విశేష పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రాఘవేంద్ర స్వామి మాట్లాడుతూ.. "సమస్త లోక కల్యాణార్థం, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించాం" అని తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మురళీకృష్ణ, వైస్ చైర్మన్ మంజునాథ్, కమిటీ సభ్యులు ఎంటిఆర్ ప్రసాద్, రెడ్డప్ప, బాబు, వీరప్ప, సుజాత, మోహనప్రియ, భువనేశ్వరి తో పాటు కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో విజయవంతంగా 31 వ రోజు 'ఇంటింటికీ తెలుగుదేశం

- 86.24 లక్షల ఇళ్లను సందర్శించిన టిడిపి యంత్రం.
- కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న మంత్రి నారా లోకేష్.



**కుప్పం,ఆగస్టు 26 (జనసంఘర్షణ):** రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ చేపట్టిన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం 31వ రోజు విజయవంతంగా కొనసాగింది. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు ప్రభుత్వ పనితీరుపై ప్రజల స్పందనను నేరుగా తెలుసుకునేందుకు తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న "ఇంటింటికీ తెలుగుదేశం – 2 ఏళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం 31వ రోజూ రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగింది. బుధవారం ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 2,31,918 ఇళ్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. దీంతో కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 86.24 లక్షల ఇళ్లను పార్టీ శ్రేణులు సందర్శించాయి. ఈ కార్యక్రమాన్ని ప్రతినిత్యం రాష్ట్ర ఐటీ విద్యా శాఖల మంత్రి, జాతీయ తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పర్యవేక్షిస్తున్నారు.

## తీర్థంలో మదర్స భవనం మంజూరుకు కృషి చేస్తాం

- మైనార్టీలకు కిషోర్ గౌడు హామీ.



**బైరెడ్డిపల్లి, ఆగస్టు26 (జనసంఘర్షణ):** బైరెడ్డిపల్లి మండలం లోని తీర్థం గ్రామంలోమదర్స భవనం మంజూరుకు కృషి చేస్తాం అని మండల టి.డి.పి.అధ్యక్షుడు కిషోర్ గౌడు బుధవారం స్థానిక మైనారిటీ సోదరులకు హామీ ఇచ్చారు.ఆయన బుధవారం సాయంత్రం తీర్థం గ్రామంలోని మసీదుకు హాజరై ముస్లిం సోదరులు మిలాడునబి పండుగ శు భాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా కిషోర్ గౌడు ను మైనారిటీ సోదరులు సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టి.డి.పి.ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం శెట్టి, స్థానిక టి.డి.పి.నాయకులు గోవిందస్వామి,రమేష్, తిప్పన్న,మహబూబ్ బాషా,రహంతుల్లా, సద్దాం, జీలాని, తదితరులు పాల్గొన్నారు.

# కలానికి పట్టాభిషేకం.. విశిష్ట సేవకులకు ఘన సన్మానం

- సూళ్లూరుపేట సీనియర్ విలేకరులు వేలూరు రమణయ్య, ఉగ్గుమూడి ఆనంద్‌లకు 'ప్రజా కళావేదిక' పురస్కారం
- రుయా సూపరింటెండెంట్ డాక్టర్ బి. మనోహర్ చేతుల మీదుగా అవార్డుల అందజేత
- జర్నలిస్టుల సేవలు సమాజానికి మార్గదర్శకం: ప్రముఖుల ప్రశంసలు




**సూళ్లూరుపేట, ఆగస్టు 26(జనసంఘర్షణ):** సమాజ హితమే ధ్యేయంగా, అక్షర పోరాటంతో సూళ్లూరుపేట నియోజకవర్గంలో విశిష్ట సేవలు అందిస్తున్న సీనియర్ విలేకరులకు తిరుపతి వేదికగా అరుదైన గౌరవం దక్కింది.నిష్పాక్షిక వార్తా కథనాలతో ప్రజలకు, రంగానికి మధ్య వారధిగా నిలుస్తున్న సూళ్లూరుపేట 'ప్రైమ్ 9' రిపోర్టర్ వేలూరు రమణయ్య, 'నేటి సూర్య' నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఉగ్గుమూడి ఆనంద్ ల సేవా తత్పరతను గుర్తించిన తిరుపతి 'ప్రజా కళావేదిక' సంస్థ బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో వారిని ఘనంగా సన్మానించింది. ప్రజా కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రత్యేక పురస్కార ప్రదానోత్సవంలో తిరుపతి రుయా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ బాదూరు మనోహర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విలేకరులు రమణయ్య, ఆనంద్‌లను దుశ్శాలువాలు కప్పి, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలోని సమస్యలను వెలికితీస్తూ, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే జర్నలిస్టుల సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు విశిష్ట అతిథులు సన్మాన గ్రహీతల అక్షర ప్రయాణాన్ని, వారి నిబద్ధతను వేనోళ్ల పొగిడారు. జర్నలిజం రంగంలో వారు చూపుతున్న పరిణితి, ప్రజా సమస్యలపై వారికున్న స్పందన అభినందనీయమని పేర్కొన్నారు.

## బివెంగమవారిపల్లి, ధర్మపురి గ్రామపంచాయితీల్లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం పూర్తిచేసిన తెలుగు తమ్ముళ్ల



**బైరెడ్డిపల్లి, ఆగస్టు26(జనసంఘర్షణ):** బైరెడ్డిపల్లి మండలంలో టి.డి.పి.నాయకులు,కార్యకర్తలు ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం విస్తృతంగా చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని వెంగము వారిపల్లి, ధర్మపురి గ్రామ పంచాయితీల్లో ఈ కార్యక్రమం 100 శాతం పూర్తి అయినట్లు తెలుస్తున్నది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్యకర్తలు సహకారంతో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలిసి రెండేళ్లలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ పతకాలు, అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తూ అలాగే వారి సమస్యలను తెలుసుకోవడం జరిగింది అన్నారు.ప్రజలు నుండి తమకు చక్కటి స్పందన లభించింది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు వారు తెలిపారు.

## వైభవముగా వేణుగోపాల స్వామి వారి తెప్పోత్సవం



**కార్వేటినగరం ఆగస్టు 26 (జనసంఘర్షణ):** కార్వేటినగరం లో వెలసిన రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో తెప్పోత్సవంలో భాగంగా బుధవారం ఉదయం ఆలయంలో సుప్రభాత సేవతో మేల్కొల్పి శుద్ధి తోమాల కొలువు పంచాంగ శ్రవణం మొదటి గంట రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి మూలవర్లకు అభిషేక అర్చన రెండోగంట సర్వదర్శనం వేణుగోపాలస్వామి వారికి స్నపన తిరుమంజనం పాలు పెరుగు తేనె హరిద్రవంతో కూడిన తిరుమంజల నిర్వహించారు. ఉత్సవంలో సమర్పణ శుద్ధి తిరువీధి ఉత్సవం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు కర్పూర హారతి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారు ఊరేగింపు అనంతరం స్కంద పుష్కరిలో తెప్పలపై విహరిస్తూ భక్తులు దర్శనం భాగ్యం కల్పించారు భక్తులు స్వామి వారికి నీరాజనం పలికారు. ఓం నమో నారాయణ అంటూ నినాదాలు చేశారు. పుష్కరిణి చుట్టూ విద్యుత్ పలకను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ండెంట్ శ్రీనివాసులు రెడ్డి ఆలయ అధికారి వీరాస్వామి, ప్రధానార్చకులు గోపాలచార్యులు, శబరినాథ్, కిరణ్ భట్టాచార్యులు, భక్తులు అధిక సంఖ్యలో స్వామి అమ్మవాలను దర్శించుకున్నారు. ఫోటో పురవీధుల్లో ఊరేగుతున్న స్వామివారు. తే ప్పపై ఊరేగుతున్న స్వామి వారు.

## అమ్మవారి సేవలో పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి

**తిరుచానూరు, ఆగస్టు 26 (జనసంఘర్షణ):**



తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి, మాజీ శ్రీకాళహస్తి బోర్డ్ మెంబర్ మస్తానయ్య బుధవారం దర్శించుకున్నారు. ఆలయం వద్ద వారికి ఆలయ సూపరింటెండెంట్ రమేష్ ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి కుంకుమార్చన సేవలో పాల్గొన్న వారికి ఆలయ అధికారులు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

## వసంత్ కుమార్ కుటుంబ సభ్యులను ఫోన్లో పరామర్శించిన ముఖ్యమంత్రిచంద్రబాబు



**చిత్తూరు ఆగస్టు 26 (జనసంఘర్షణ):** చిత్తూరుతెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ చెరుకూరి వసంత్ కుమార్ భార్య శిల్ప, పిల్లలు మోక్ష శ్రీ, దమరకేశ్వర్ లతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోన్లో వీడియో కాల్ ద్వారా పరామర్శించి మాట్లాడారు. బుధవారం మధ్యాహ్నం చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఫోన్ చేయించి వసంత్ కుమార్ భార్య పిల్లలతో మాట్లాడించారు. సీఎం మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే కార్యకర్త వసంత్ కుమార్ మృతి తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని, తెలుగుదేశం పార్టీ, నేను మీకు అండగా ఉంటామని ముఖ్యమంత్రి ధైర్యం చెప్పారు. అన్నివేళలా అండగా నిలుస్తామన్నారు. ధైర్యంగా ముందుకు సాగాలని, పిల్లలను బాగా చూసుకోవాలన్నారు. ఏ అవసరం ఉన్నా వారికి అండగా ఉండాలని ఎమ్మెల్యే గురుజాల జగన్ మోహన్ కు చెప్పారు.వీలు చూసుకుని పిల్లలను తన వద్దకు తీసుకురావాలని ఎమ్మెల్యేకి సూచించారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co